క్లుప్తంగా

కామాఖ్య శక్తిపీఠంలో పీఆర్కే పూజలు



మాచర్ల: శ్రీ కామాఖ్య శక్తి పీఠం ప్రధాన అర్చకులు శ్రీ జ్ఞానానాథ శర్మ, శ్రీ అబ్బూరి కిషోర్ శర్మలను బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు కలిశారు. తెనాలి కొత్తపేటలో ఉన్న ఆస్ట్రాలజిక్ 369 జ్యోతిష్యాలయానికి వెళ్లిన వారు కామాఖ్య అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

పట్టణంలో 'గుడ్‌మార్నింగ్ మాచర్ల'



మాచర్ల: మాచర్ల పట్టణంలో బుధవారం గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి రింగ్‌రోడ్డు, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పర్యటించారు. ఆప్రాంత ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ కాలనీ వాసులు మంచినీటి సమస్య, తుమ్మ చెట్లు పెరిగాయని, వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పలు సమస్యలను వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ నరసింహారావు ఈనెల 28వ తేదీన జరిగే పురపాలక సంఘ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి నిధులు కేటాయించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 18వ వార్డులో పూల కొట్ల ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, 15వ వార్డు కౌన్సిలర్ చందు గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



రెంటచింతల: గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ఎంతో క్రమశిక్షణ కలిగి అనేక రాష్ట్రాలలో అధికారంలో కొనసాగుతుందన్నారు. బీజేపీ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరూ అంకితభావంతో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి క్రమశిక్షణతో ముందుకు తీసుకుపోవాలన్నారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు యేలూరి శశికుమార్, ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి దయాకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్టీ రాష్ట్ర నాయకులు శెట్టి హనుమంతరావు, మాచర్ల కన్వీనర్ నాసరయ్య తదితరులున్నారు.

బాలాజీ టవర్‌లో గ్యాస్ సిలెండర్ లీక్

సకాలంలో మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది



పిడుగురాళ్ల: గ్యాస్ సిలెండర్‌లో గ్యాస్ లీకేజై ఒక్కసారిగా మంటలు రేగిన ఘటన పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లోని బాలాజీ టవర్స్‌లో డి.సాంబశివరావుకు చెందిన ప్లాట్‌నెంబర్ 201లో జరిగింది. సంఘటనకు సంబంధించి పిడుగురాళ్ల ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... సాంబశివరావుకు చెందిన అపార్టుమెంట్‌లో మహిళలు పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీక్ అయి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న తాము వెంటనే అపార్టుమెంట్ వద్దకు చేరుకొని సిలెండర్ నుంచి వస్తున్న మంటలను అదుపు చేశామన్నారు. ప్రమాదంలో సుమారు రూ. 15 వేల ఆస్తినష్ట జరిగిందన్నారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వినుకొండలో జాబ్‌మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్సేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21వతేదీన వినుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు బుధవారం తెలిపారు. పదవ తరగతి నుంచి పీజీ వరకు, బిటెక్, ఫార్మసీ, డిప్లొమో చదివిన నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరై ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు.

ఆలయ నిర్మాణం.. శరవేగం



దుర్గిలో నిర్మితమవుతున్న వేంకటేశ్వర స్వామి దేవాలయం



నిర్మాణంలో ఉన్న దేవాలయ ముందు భాగం

- 2007లో దుర్గి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ
- అనివార్య కారణాలతో ఆదిలోనే ఆగిపోయిన నిర్మాణాలు
- గతేడాది అక్టోబరులో పునఃప్రారంభం
- సుమారు రూ.2కోట్లతో చకచకా పనులు
- దశాబ్దాల కల.. త్వరలో నెరవేరనున్న వేళ

దుర్గి: దుర్గి గ్రామ ప్రజల దశాబ్దాల స్వప్నం నెరవేరనున్న సమయం ఆసన్నమైంది. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి ఆలయం శరవేగంగా నిర్మాణం జరుగుతుంది. ఎన్నో అవాంతరాలు, ఇబ్బందులు వంటివి ఎదురైనా మొక్కవోని ధైర్యం, భక్తితో ఆలయ నిర్మాణం కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన దుర్గిలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణపు పనులు జరుగుతున్నాయి. దుర్గి నుంచి ముటుకూరు వెళ్లే దారి పక్కన శేషం వారి కుంట స్థలంలో దాదాపుగా 60 సెంట్లలో ఆలయ నిర్మాణం జరుగుతుంది. సుమారు 20 సెంట్లలో కల్యాణ మండపానికి పోను మిగిలిన భాగమంతా దేవాలయ నిర్మాణానికి కేటాయించారు. స్వామి వారి ఆలయ నిర్మాణానికి సుమారు రూ. 2కోట్ల నిధులు అవసరమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు, పరిసర ప్రాంతాల దాతల సహాయంతో నిధులు సేకరించనున్నట్లు తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 5న వేద మంత్రోచ్చారణల నడుమ భూమి పూజను పునఃప్రారంభించి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

ముందుకొస్తున్న దాతలు

ఆలయ పునః నిర్మాణానికి స్వామి వారే భక్తుల రూపంలో చేయూతనందిస్తారనే సంకల్పంతో ఆలయ కమిటీ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చేయూతనందిస్తున్నారు. గత ఐదు నెలలుగా కొందరు దాతల సహకారంతో నేటి వరకు ఎటువంటి అవాంతరం లేకుండా నిర్మాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామి వారి దర్శనం చేసుకునే ముందు స్నానమాచరించే వారి కోసం కొలను ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. స్వామి వారి ఆలయంలో ఆళ్వార్లు, గరుడ వాహనం, తాండవ కృష్ణ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతి పర్వదినం నాటికి ఆలయ పూర్తి చేసి స్వామి వారి భక్తులకు అందుబాటులోకి తీసుకురావటానికి శతవిధాలుగా కృషి చేస్తున్నామని కమిటీ సభ్యులు వివరించారు.

డిమాండ్ల సాధన కోసం పోరాడుదాం

వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమాయూన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న హుమాయూన్ బాషా

పిడుగురాళ్ల: రాష్ట్రంలోని వలంటీర్ల డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాడాలని వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమాయూన్ బాషా తెలిపారు. పట్టణంలోని బుధవారం వలంటీర్ల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... వలంటీర్ల డిమాండ్ల సాధన కోసం కర్నూలు, నంద్యాల, గుంటూరు పలు జిల్లా కేంద్రాల్లో మార్చి 7, విశాఖ, విజయవాడల్లో 17వ తేదీల్లో విజయవంతంగా ధర్నా నిర్వహించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లోనూ, ప్రజల్లోనూ వలంటీర్ల సమస్య చర్చకు వచ్చేలా చేయగలిగామన్నారు. ఈ నెల 30న మరో ముఖ్యమైన ఆందోళన చేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఆ రోజు ఆదివారం, ఉగాది పండుగ అయినప్పటికీ అందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాక్షాత్తు సీఎం వలంటీర్ వ్యవస్థపై అవమానంగా మాట్లాడుతున్నారని, వారు ఇచ్చిన దగా హామీలను యావత్తు రాష్ట్ర ప్రజానీకం ముందుకు తీసుకొని వచ్చి, గుర్తు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలోని వలంటీర్లు అందరూ ఉగాదినాడు గాంధేయ పంథాలో నిరాహార దీక్షలు చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈదర గోపీచంద్, వలంటీర్ల నాయకుడు రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 56 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కిల్ హబ్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ డ్రైవ్‌లో నాలుగు కంపెనీలు పాల్గొనగా, 93 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. అందులో 56 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి హాజరై ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం.రవీంద్రనాయక్, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, స్కిల్ హబ్ ట్రైనర్ మస్తాన్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, సిడాబ్ జాబ్ రిసోర్స్ పర్సన్ నానిక్యా నాయక్‌లు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



రెంటచింతలలో చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం. అర్జున్‌నాయక్

రెంటచింతల: రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతున్న రెంటచింతలకు వివిధ పనుల కోసం పలు గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులకు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎం.తహసీల్దార్ అర్జున్‌నాయక్, అన్నారు. బుధవారం స్థానిక మీసేవా కేంద్రం వద్ద గూలి సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి తండ్రి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. ముందుతున్న ఎండలకు 90 రోజులపాటు చల్లటి మంచినీటిని పంపిణీ చేసేలా ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. తహసీల్దార్ అర్జున్‌నాయక్‌ను, ఆదిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కె.రంగనాయకులు, వీఆర్వోలు పాశం నాసర్‌రెడ్డి, విగ్నేష్, నాసరయ్య, అబ్రహాం, ఫౌండేషన్ సభ్యులు పేరం రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవిందరెడ్డి సేవలు ప్రశంసనీయం..



మాచర్లలో మొబైల్ ఉచిత మంచినీరు పంపిణీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్

మాచర్ల రూరల్: మండు వేసవిలో మొబైల్ వాహనం ద్వారా ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ పంపిణీకి శ్రీకారం చుట్టిన మెట్టు గోవిందరెడ్డి సేవలు అభినందనీయమని తహసీల్దార్ బి కిరణ్ కుమార్ కొనియాడారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొబైల్ ఉచిత మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. వివిధ పనుల కోసం గ్రామీణ, పట్టణ ప్రజలు సంచరించే ప్రదేశాల్లో ప్రజలకు తన మొబైల్ వాహనం ద్వారా స్వచ్ఛమైన కూలింగ్ నీటిని అందిస్తూ వారి దాహార్తిని తీరుస్తున్న సమితి సేవలు ప్రశంసనీయమన్నారు. రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు, మాచర్ల సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ గాదె శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ముక్కా గురవయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంటూరు అనిల్ కుమార్, సంగీత ఉపాధ్యాయులు షేక్ లాల్ సాహెబ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు అందుగుల చంద్రయ్య, వీఆర్‌ఓలు తదితరులున్నారు.

గురజాలలో...

గురజాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో చలివేంద్రంను బుధవారం ఆర్డీఓ ప్రారంభించారు. వేసవిని దృష్టిలో వుంచుకుని కార్యాలయంకు వచ్చే అర్జీదారులు మంచినీటికి ఇబ్బందులు లేకుండా చూడాలనే ఆలోచనతో ఈ చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. తహసీల్దార్ కె.నగేష్ తదితరులున్నారు.

తపస్సు కాలం.. ఎంతో పవిత్రం

కానుకమాత చర్చి విచారణ గురువులు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: లోకరక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ మరణం పొందే ముందు అంతిమ ఘడియలలో పడిన శ్రమలను జ్ఞాపకం చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవ లోకం తపస్సు కాల ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక లూర్దు మాత మందిరం ఆవరణలో నిర్వహించిన తపస్సుకాల ప్రత్యేక ప్రార్థనలలో ఫాదర్ వైఎల్ మర్రెడ్డి పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభువైన ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళిని పాపములనుంచి కాపాడేందుకు శిలువమరణం పొందారన్నారు. తపస్సుకాలంలో దీక్ష తీసుకునే భక్తులు భక్తిశ్రద్ధలతో, నిష్ఠతో 40 రోజులుగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు. సహాయ గురువులు రె.ఫాదర్ అగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు

మాచర్ల రూరల్: మండలంలోని అడిగొప్పలలో 34 ఎకరాల భూమిలో 2003లో సీఎం చంద్రబాబు హయాంలో చర్మకారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లెదర్ పార్కు కబ్జా గురవుతున్నట్లు ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లెదర్ పార్కు 34 ఎకరాల భూమిని సందర్శించారు. లెదర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్‌కు కేటాయించిన భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయనవెంట ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి రెడ్డబోయిన ప్రసన్న కుమార్, రాష్ట్ర నాయకులు కోట సుబ్బు, జిల్లా కన్వీనర్ పేరుపోగు రామయ్య, జిల్లా కో-కన్వీనర్ గుండాల నగేష్, దుర్గి మండల అధ్యక్షుడు పేరుపోగు సాగర్, జనసేన నాయకులు కిషోర్, గోపి, మేకల దాసు తదితరులున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మహిళలతో మాట్లాడుతున్న డాక్టర్ వి.భవిత

పిడుగురాళ్ల: మహిళలు వస్తువుల తయారీ రంగంలో శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని ఏఎన్‌యూ సీఎస్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.భవిత అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ల పట్టణ సమీపంలో కొండమోడు ప్రాంతంలో జూట్ తయారీ ఉత్పత్తి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.భవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నాగార్జున విశ్వవిద్యాలయం విద్యను అందించటం తోపాటు అనేక సామాజిక సేవా శిక్షణ కార్యక్రమాలు సీఎస్ఆర్ ద్వారా నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ముస్లిం మైనార్టీ మహిళలకు ముఖ్యంగా జూటు ఉత్పత్తుల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. నెల రోజులు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ పూర్తయితే జూటు ఉత్పత్తి తయారీ వస్తువుల ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. సీఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మండూరి వెంకట రమణ, ట్రైనర్ పి.దుర్గ, కేఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు నరసింహారావు, బాడిస మస్తాన్, సుమారు 50 మంది ముస్లిం మైనార్టీ మహిళలు ఉన్నారు.

అంతర్ కళాశాలల పోటీల్లో 'స్కాలర్' సత్తా



అంతర్ కళాశాలల పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన స్కాలర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు

పిడుగురాళ్ల: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పిడుగురాళ్ల పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. గుంటూరు సమీపంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన పోటీల్లో స్కాలర్ డిగ్రీ కాలేజీ ఫైనల్‌కు చేరి ఫైనల్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ఈ పోటీలలో విజయం సాధించిన జట్టుకు ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బహుమతిని ప్రదానం చేశారు. ఆల్ ఇండియా విశ్వవిద్యాలయ పోటీలకు జరగబోయే ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు స్కాలర్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారని స్కాలర్స్ కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులను స్కాలర్స్ విద్యా సంస్థల డైరెక్టర్లు జి.శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, ఏసీ క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపాల్ గాదె బ్రహ్మారెడ్డి, దాచేపల్లి స్కాలర్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రంగారెడ్డి, స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

యడ్లపాడులో చోరీకి విఫలయత్నం



సీసీ ఫుటేజ్‌లో చిక్కిన దుండగుడు

యడ్లపాడు: స్థానిక స్టేజీ సెంటర్ సమీపంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు...గ్రామానికి చెందిన పోపూరి సాంబయ్యకు ఇద్దరు సంతానం వారు ఎన్ఆర్ఐలు కావడంతో సాంబయ్య కొంత కాలం స్వగ్రామంలోనూ, హైదరాబాద్‌లోనూ మరికొంతకాలం నివాసం ఉంటుంటా డు. దీనినే అదునుగా చేసుకున్న గుర్తు తెలియని దుండగులు సాంబయ్య హైదరాబాద్ వెళ్లిన విషయం గమనించి బుధవారం రాత్రి స్థానికంగా ఉన్న ఆయన ఇంటిలో చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. సదరు ఇంట్లో సీసీ కెమెరాలు ఉండటంతో దుండగుల కదలికలు రికార్డు అయ్యాయి. ముందుగా ప్రధాన గేటు గడియను పగలగొట్టేందుకు ప్రయత్నించగా దానికి సెంట్రల్ లాక్ ఉండి ఓపెన్ కాలేదు. ఇంటి ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పక్కకు తిప్పి, ఎలాంటి ఆధారాలు మిగలకుండా జాగ్రత్త లు తీసుకున్నారు. అయినప్పటికీ, ఇంటి చుట్టుపక్కల మరికొన్ని సీసీ కెమెరాలు ఉండటంతో వారి కదలికలు రికార్డు అయినట్లు తెలుస్తోంది. ఇదివరకు ఇదే ఇంటిలో మూడుసార్లు చోరీలు జరిగాయని, తొలి ఘటనలో భారీ నష్టం జరిగినప్పటికీ ఆ తర్వాత మాత్రం చిన్న స్థాయి దొంగతనాలు జరిగినట్లు బాధితుడు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేటటౌన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. పురపాలక సంఘంలోని తన కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు, పట్టణ జనాభాకు తగ్గటుగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల మరమ్మతుల కారణంగా మంచిటి సరఫరాలో కొన్ని ప్రాంతాల్లో అసౌకర్యం కలిగిన విషయాన్ని పురప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వేకువజామున నమాజ్‌కు వెళ్లే వారికి ఇబ్బందులు లేకుండా వీధి లైట్ల ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లోని వీధిలైట్లు, బోర్ల మరమ్మతులకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అవసరమైన చోట విద్యుత్ పోల్స్ ఏర్పాటుపై సంబంధిత డీఈతో మాట్లాడటం జరిగిందన్నారు.

సునీత విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: అంతరిక్ష వ్యోమగామి సునీత విలియమ్స్ విజయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఆర్‌కేటీ కాలనీ మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం గురులింగం తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్ర నుంచి భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ విజయవంతంగా భూమికి చేరడాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఎనిమిది రోజుల పర్యటన కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సునీత తొమ్మిది నెలల సుదీర్ఘకాలం అక్కడే గడిపి బుధవారం భూమికి చేరుకుందని తెలిపారు. సునీత విలియమ్స్ పేరు అంతరిక్ష పరిశోధనలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సుబ్బారావు, అపర్ణ, ఫాతిమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకోనారాయణస్వామి తిరునాళ్ల



బొల్లాపల్లి : మండల కేంద్రమైన బొల్లాపల్లిలో శ్రీ వెంకట ఏకోనారాయణస్వామి తిరునాళ్ల అంగరంగవైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పశువులు వృద్ధి చెందాలని రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు కొందరు తమ వంతు సేవా కార్యక్రమాల్లో భాగంగా భక్తులకు పులిహోర, మజ్జిగ, మంచినీరు అందజేశారు. గ్రామంలో భక్తుల ఉల్లాసం కొరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 4 భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ ఆధ్వర్యంలో తిరునాళ్లను పురస్కరించుకొని అల్లర్లకు తావు లేకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో డిప్యూటీ డీఈఓ తనిఖీలు

పిడుగురాళ్ల: పట్టణం, మండలంలోని పలు పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో బుధవారం నర్సరావుపేట డిప్యూటీ డీఈఓ సుభాని ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని నారాయణ స్కూల్, అలాగే మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు పరీక్షా కేంద్రాలు, మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాలను పరిశీలించారు. ఇన్విజిలేటర్ల పనితీరును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ సభలు

మాచవరం: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బందితో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి రికార్డులను అందజేసినట్లు తెలిపారు. మండలంలో ఆయా గ్రామాల్లో మొత్తం రూ.4,75,52,00,94 లకు గానూ తనిఖీలు జరుగుతాయన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించి, మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు.

మార్కెట్ల వేలం ఆదాయం రూ. 11.45 లక్షలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ పరిధిలోని నాలుగు మార్కెట్లకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి వేలం బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ వేలంలో ఐతం పెద మాణిక్యరావు రూ.11.45 లక్షలకు కూరగాయాల మార్కెట్, సంత్రీ మార్కెట్, మాంసం మార్కెట్, చేపల మార్కెట్‌లను కైవసం చేసుకున్నాడు. వేలంలో ఐతం పెద మాణిక్యరావుతో పాటు వడ్లవల్లి సాంబశివరావు, ఫణిత కాంతారావులు పాల్గొన్నారు. గత ఏడాది రూ. 10.35 లక్షలు ఉన్న పాట ఈ దఫా రూ. 1.10 లక్షలు అదనంగా పెరిగిందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తెలిపాడు.

ఉప సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్

మాచవరం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని పిన్నెల్లి, మాచవరం, వేమవరం గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు బుధవారం తెలిపారు. ఈనెల 23వ తేదీలోగా వార్డు మెంబర్లకు ఉప సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈనెల 27న గ్రామ సచివాలయాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామన్నారు.